యువతను సన్మార్గంలో పెట్టేందుకే పాదయాత్ర



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, సెప్టెంబర్ 26: యువతను సన్మార్గంలో పెట్టేందుకే అలంపూర్ నుంచి ఉమామహేశ్వరం వరకు సత్య శోధన పాదయాత్ర చేపడుతున్నట్లు జిల్లా విశ్రాంత విద్యాధికారి శివార్చక విజయ్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా 100రోజులకు సంబంధించిన పాదయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతిని పురస్కరించుకొని జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల నుంచి ప్రారంభమై100 రోజుల్లో 1000 కిలో మీటర్ల పాదయాత్ర చేసి ఉమామహేశ్వరంలో ముగియనున్నట్టు వారు పేర్కొన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తా

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26: జిల్లాలోని యువత అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధి సాధించేందుకు కృషిచేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిఅన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి యువజ నోత్సవాలు జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో యువతకు సాంస్కృతిక, జానపద నృత్యం, జానపద గీతాలాపన, వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస, కవిత్వం వంటి రంగాల్లో పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ స్థానంలో వచ్చిన కళాకారులకు బహుమతులు ఇవ్వడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం కార్యక్రమం ఉద్దేశమన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళల్లో నైపుణ్యం సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెర్ కార్యక్రమాలను వారు తిలకించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి సుధీర్‌రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, పీఈటీ సురేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్, జిల్లా సీనియర్ కళాకారుడు డప్పు స్వామి, కళాకారులు పాల్గొన్నారు.

'గట్టు' సామర్థ్యం పెంచితే తెలంగాణకు నష్టమే..

- నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్

గట్టు ఎత్తిపోతల పనులను పరిశీలిస్తున్న గొంగళ్ల రంజిత్‌కుమార్

కేటీదొడ్డి, సెప్టెంబర్ 26 : 15 టీఎంసీల సామర్థ్యంతో గట్టు ఎత్తి పోతల రిజర్వాయర్ నిర్మిస్తే జూరాల ప్రాజెక్టు కంటే ఎక్కువ భూములు, గ్రామాలు కోల్పోయి తక్కువ భూములకు సాగునీరడంతో తెలంగాణ రాష్ట్రానికి నష్టమే జరుగుతుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గట్టు ఎత్తి పోతల ప్రాజెక్టును సామర్థ్యం పెంచి అంతర్రాష్ట్ర ప్రాజెక్టు మార్చుతామని ప్రతిపాదనలు తేవడంతో రంజిత్‌కుమార్ గురువారం గట్టు ఎత్తి పోతలను పరిశీలించారు. ప్రాజెక్టును సామర్థ్యం పెంచడంతో పక్క రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతుందని, గట్టు, కేటీదొడ్డి మండలాలు తీవ్రంగా నష్ట పోతాయని ఇదే జరిగితే చూస్తు ఊరుకోమని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేయకుంటే నడిగడ్డ హక్కుల పోరాట సమితి తర ఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్ ఎంఈవో శ్రీనివాసులును శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఈవోకు సన్మానం

పాన్‌గల్,సెప్టెంబర్ 26: నూతన ఎంఈవో బాధ్యతలు చేపట్టిన బి.శ్రీనివాసులును గురువారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీభవనంలో లిటిల్‌స్టార్ హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. విద్యాపరంగా మండలాన్ని జిల్లాలో మొదటిస్థానంలో నిలబెట్టేం దుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాకం ఆంజనేయులు, శేఖర్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
★కల్వకుర్తిలో 150 గజాల ఇండిపెండెంట్ హౌస్ అమ్మకానికి సిద్ధంగా ఉన్నది. 40 అడుగుల రోడ్ మరియు 700 మీటర్ల నుండి MBNR X రోడ్. రేటు: 50 లక్షలు. సెల్ నెం.: 9010333505.
NT-335168

BUSINESS OFFER
★పెట్టుబడి పెట్టండి.. ప్రతిరోజూ సాయంత్రం లాభాలు పొందండి... వ్యాపారం చేయాలనుకునే వారికి అవకాశం. ఆఫీస్: ఎల్.బి.నగర్, హైదరాబాద్. 8897651635.
NT-338767

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచింపడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

వనపర్తి జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల జిల్లా కేంద్రంలో ఎంఏఎల్‌డీ కళాశాలలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

భిల్లాఘణపురంలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నేతలు

అయిజ పట్టణంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ

- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, అధికారులు

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, సెప్టెంబర్ 26 : భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఆయా మండలాల్లో వివిధ గ్రామాల్లో గురువారం చాకలి ఐలమ్మ 129 జయంతి సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొరల వ్యవస్థను, రజకార్ల దురాగతాలను ఎదురించిన వీరవనిత ఐలమ్మ అని ఆమె సేవలను పలువురు కొనియాడారు. వనపర్తి జిల్లా కేంద్రం లోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి, పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాన్‌గల్ మండలంలోని గోప్లాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పెద్దమందడి మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.సైదయ్య ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ కళాశాలలో, గట్టు జూనియర్ కళాశాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్వాల మండలంలోని బీరెల్లి గ్రామంలో మాజీ జెడ్పీ వైస్ చైర్ పర్సన్ సరోజమ్మ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అయిజ పట్టణంలోని గాయత్రీ డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ జిల్లా నేత కురువ పల్లయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాములు, నర్సింహ కాలనీ ప్రధాన రోడ్డుపై అఖిలపక్ష కమిటీ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రవల్లి చౌరస్తా పదోపటాలంలో అదనపు కమాండెంట్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పాన్‌గల్: గోప్లాపూర్ చాకలి ఐలమ్మ నూతన విగ్రహావిష్కరణ చేపడుతున్న నాయకులు పుల్లారావు

గట్టు జూనియర్ కళాశాలలో..

వడ్డేపల్లి: శాంతినగర్‌లో ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు

పెద్ద మందడి ఉద్యాన కళాశాలలో ఐలమ్మ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



అలంపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

పదోపటాలంలో అదనపు కమాండెంట్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఉండవెల్లిలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మహిళా చైతన్యానికి ప్రతీక ఐలమ్మ

- కలెక్టర్ సంతోష్

గద్వాల, సెప్టెంబర్ 26 : తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర విశేషమైందని మహిళా చైతన్యం, శక్తికి ప్రతీక ఐలమ్మ అని కలెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, భూస్వాముల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడి మహిళా చైతన్యానికి మార్గం చూపారని కొనియాడారు. ఆమె పోరాటం కేవలం వ్యక్తిగతంగా సాధించిన విజయం మాత్రమే కాకుండా సమాజంలో అణగారిన వర్గాలకు గొప్ప ప్రేరణగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అధికారులు వీర భద్రప్ప, రమేశ్‌బాబు, కాంతమ్మ, సరోజమ్మ పాల్గొన్నారు.

లక్ష్యాలు వేగవంతం చేయాలి

గద్వాల, సెప్టెంబర్ 26 : మహిళా శక్తి పథకం లక్ష్యాల సాధనకు కార్యాచరణ వేగవంతం చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మహిళా శక్తి పనుల పురోగతిపై బ్యాంకర్లు, సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి పథకం కింద జిల్లాలోని అన్ని మండలాల్లో యూనిట్లు ప్రయోజనకరంగా కొత్త ఆలోచనలతో దీర్ఘకాలం ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా మైక్రోఎంటర్‌ప్రైజెస్, స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ యూనిట్లు, ఫ్రోట్లీ మదర్ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మిల్క్ పార్లర్లు వంటి విభాగాల్లో నెలవారీగా యూనిట్ల గుర్తింపు, స్థాపన, టార్గెట్లను సాధించేందుకు మండలాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ ప్రోగ్రామ్ మేనేజర్లు ప్రతి మండలంలో రెండు ఎంబ్రాయిడరీ యూనిట్లు, కటింగ్ మిషన్ యూనిట్లు గుర్తించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో నర్సింగ రావు,ఎల్‌డీఎం అయ్య పుల్లెడ్డి, అధికారులు వెంకటేశ్వర రావు, షకీలా భాను, నర్సింహులు, సక్రియానాయక్, రామ్మూర్తి ఏపీఎంలు, డీపీఎంలు పాల్గొన్నారు.

జోగులాంబ గద్వాల కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలె వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

వనపర్తి కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, చిన్నారెడ్డి

తెలంగాణ వీర వనిత ఐలమ్మ

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26 : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప స్ఫూర్తి ప్రదాత అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ 129జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు చిన్నారెడ్డితో పాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, యుగంధర్‌గౌడ్, కోళ్ల వెంకటేశ్, రజక సంఘం నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, మహేశ్‌కుమార్, శ్రీను, చంద్ర మౌళి, కొండన్న, తిరుమలేశ్ తదితరులు ఉన్నారు.

వ్యక్తులపై కేసు నమోదు

గోపాల్‌పేట, సెప్టెంబర్ 26 : పొలానికి వెళ్లే దారికి అడ్డు పడుతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు..పాన్‌గల్ మండలం కొత్తపేటకు చెందిన సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి గోపాల్‌పేట మండలంలోని మున్ననూర్ గ్రామ శివారులో కొంత కాలం కిందట వ్యవసాయ భూమి కొను గోలు చేశాడు. పొలానికి బాట కోసం గ్రామానికి చెందిన బాద గోని పుష్పలత భర్త శ్రీధర్‌గౌడ్ నుంచి 3గుంటల భూమి కొనుగోలు చేశాడు. పొలం చుట్టూ కంచె ఉండగా, పొలానికి బాట, గేటు ఏర్పాటు చేసుకున్నాడు. ఇది ఇలా ఉండగా అదే గ్రామానికి చెందిన పక్క పొలం రైతు బాద గోని నారాయణగౌడ్ అతడి కుటుంబ సభ్యులు కలిసి దౌర్జన్యంగా పొలానికి ఏర్పాటు చేసిన కంచె స్థంబాలను ధ్వంసం చేసి, పొలానికి వెళ్లకుండా బాటకు అడ్డు పడుతున్నారని గురువారం వెంకట్‌రెడ్డి కుమారుడు నవీన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

కొత్తకోట,సెప్టెంబర్ 26 : కొత్తకోట పట్టణకేంద్రంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి మూడురోజుల నుంచి కనిపించకుండా పోవడంతో అతని భార్య కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మర్లు కాలనీకి చెందిన సారంగి శ్యామ్ కొంత కాలంగా వనపర్తి జిల్లా కొత్త కోట పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో భార్య జమున, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. రెండేళ్లుగా పట్టణంలోని పరమేశ్వరి మెడికల్ షాపును అద్దెకు తీసుకొని నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 24వ తేదీ సాయంత్రం టీ తాగి వస్తానని భార్యతో చెప్పి మెడికల్ షాపు నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి షాపు మూసే సమయానికి రాకపోవడంతో శ్యామ్‌కు భార్య ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్‌గా ఉండడంతో బంధువులు, అతడి స్నేహితులకు ఫోన్ చేసినా ఎలాంటి సమాచారం దొరకలేదు. మెడికల్ షాపు నిర్వహణ కోసం తెలిసిన వారి దగ్గర పెద్ద మొత్తంలో అప్పులు చేశాడని, అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తున్నారని, పలుమార్లు భార్యకు చెప్పినట్లు అప్పుల బాధతో తన భర్త కనిపించకుండా వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొంది. జమున ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఖాతాదారుల ఇక్కట్లు తీర్చాలి

వడ్డేపల్లి, సెప్టెంబర్ 26: శాంతినగర్‌లోని ఏపీజీవీబీలో లోన్ల కోసం వచ్చిన రైతులు, ఖాతాదారులకు లోన్లు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని గురువారం ఖాతాదారులు మేనేజర్ గురువారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మధ్యవర్తులు, దళారుల ద్వారా వచ్చిన వారి పనులు త్వరగా అవుతున్నాయని.. ఇదెక్కడి న్యాయమని వెంకటేశ్‌యాదవ్, రవి, ఆంజనేయులు గౌడ్, అనిల్, అశోక్ తదితరులు మేనేజర్‌ను ప్రశ్నించారు. ఈ విషయమై మేనేజర్‌ను వివరణ కోరగా నా దృష్టికి రాలేదని, ఇబ్బందులు ఎదుర్కొన్న ఖాతాదారులు లిఖిత పూర్వంగా ఫిర్యాదు ఇస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

నల్లబ్యాడ్జీలతో పంచాయతీ కార్యదర్శుల నిరసన

భిల్లాఘణపురం, సెప్టెంబర్ 26 : నల్లగొండ జిల్లాలో ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులను అకారణంగా సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీడీవో, ఎంపీవోలతో కలిసి పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో 7నెలల పైబడి ప్రత్యేక అధికారుల పాలన నడుస్తుందని, పంచాయతీల్లో బడ్జెట్ లేకున్నా అప్పులు చేసి మరీ గ్రామాలను నడిపిస్తున్నది కార్యదర్శులు కాదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో పనులను తన జీతం డబ్బుల ద్వారా, అప్పులు చేసో నిర్వహిస్తుంటే అది గమనించకుండా తిరిగి మళ్లీ సస్పెండ్ చేయడానికి ఏదో పనికి రాని కారణాలను చూపుతూ నల్లగొండ జిల్లాలో ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులను అకారణంగా సస్పెండ్ చేసిన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలు ఆపక పోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిలోని పంచాయతీ రాజ్ ఉద్యోగులు విదులు బహిష్కరించి సామూహిక సమ్మెకు పోవడానికి కూడా వెనుకాడమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భిల్లాఘణపురం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నల్లగొండ కలెక్టర్ వైఖరి మార్చుకోవాలి

మదనాపురం, సెప్టెంబర్ 26 : తనతో పాటు పనిచేసే ఉద్యోగులని చూడకుండా నల్లగొండ కలెక్టర్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఎంపీడీవో ప్రసన్నకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ తీరును నిరసిస్తూ గురువారం మదనాపురం మండలానికి చెందిన ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తప్పు చేస్తే సరిచేసి మరోసారి జరగకుండా చూడాలని హెచ్చరించాలి కాని తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. నల్గొండ కలెక్టర్ తన వైఖరి మార్చుకోకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఉసేనప్ప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్, పంచాయతీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

ఆత్మ కూరు/పెబ్బేరు/అమరచింత/చిన్నంబావి/ పాన్‌గల్/ మదనాపురం/ పెద్దమందడి, సెప్టెంబర్ 26 : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్, పంచాయతీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులను పంపిణీ చేశారు. అలాగే పారిశుధ్య కార్మికులకు చేతిగ్లౌజులు, సబ్బులు, నూనె,యూనిఫాంలు పంపిణీ చేశారు. ఆత్మ కూరులో 56 మందికి, పెబ్బేరులో 120 మందికి, అమరచింత 66మందికి, చిన్నంబావిలో 81 మందికి, పాన్‌గల్ 180 మందికి, పెద్దమందడి, మదనాపురంలో పంచాయతీ కార్మికులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీవో ఉమాదేవి , ఎంపీడీవోలు సుజాత, రవీందర్, గోపాల్‌రావు, శ్రీనివాసులు, రమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషు, ఎంపీవోలు శ్రీరాం జెడ్డి, రామస్వామి, రఘురాములు, సూపరింటెండెంట్ పార్వతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్ ఏపీవో కుర్మయ్య, సీహెచ్‌వో రామయ్య, వైద్యులు సుధారాణి, వినీలా, సిబ్బంది వైద్యులు నందకిశోర్, రాజశేఖర్, చైతన్య, చంద్రశేఖర్ శ్రీకాంత్, నాగరాజు, తారాశశాంక్, వసంత, రూపశ్రీ, నికిత, ల్యాబ్ టెక్నిషన్ రాజు, ఏఎన్ఎంలు శారద, హేమలత, ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు వెంకటప్ప తిరుపాజు, పుష్ప, రవికుమార్, కరుణాకర్‌రెడి ఆశ కార్యకర్తలు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరచింతలోని ప్రభుత్వ దవాఖానలో పంచాయతీ కార్మికుల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెబ్బేరులో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కార్యాలయాలు తనిఖీ

వడ్డేపల్లి, సెప్టెంబర్ 26: జిల్లా పరిషత్ ద్వారా మంజూరైన వివిధ అభివృద్ధి పనుల తనిఖీల్లో భాగంగా గురువారం జెడ్పీ సీఈవో కాంతమ్మ వడ్డేపల్లి ప్రభుత్వ దవఖానను పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మితమవుతున్న ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26 : ఈ నెల 28వ తేదీన జిల్లా, ఆత్మకూరు కోర్టుల్లో నిర్వహించున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యే కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో సామరస్య ధోరణితో వివిధ కేసులపై కోర్టు చుట్టు తిరుగకుండా పరిష్కరించుకోవాలన్నారు. రాజీపడే అవకాశమున్న కేసుల లిస్ట్ అవుట్‌ను సంబంధిత పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది తెలుసుకోవాలని, ఇరువర్గాలతో మాట్లాడి చిన్న చిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించి రాజీమార్గం ద్వారా పరిష్కరించాలని సూచించారు. అందుకు కోర్టు కానిస్టేబుళ్లు కూడా కృషి చేయాలన్నారు.

ఉపకరణాల పంపిణీ

గద్వాల, సెప్టెంబర్ 26: జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి సుజాత గురువారం ప్రకటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అలింకో సంస్థ కలిపి ప్రత్యేక నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరం 28వ తేదీ గట్టు రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీసం 40 శాతం వైకల్యం ఉన్నట్లు నిరూపించే సదరం సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, తెల్లరేషన్‌కార్డు లేదా లబ్ధిదారుడికి వారి సంరక్షకులకు నెలకు రూ.22,500 లేదా అంతకంటే తక్కువ ఆదాయం ఉన్నట్లు నిరూపించే విధంగా ఉండాలన్నారు. 16 ఏండ్ల కంటే ఎక్కువ వయస్సు ఉండే వారు వైకల్యం కనబడే విధంగా రెండు ఫొటోలు తీసుకరావాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే దివ్యాంగులు తమ ధ్రువపత్రాల తోపాటు పైన పేర్కొన్న తేదీలో శిబిరం నిర్వహించే ప్రదేశంలో ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. ముఖ్యంగా గత మూడేండ్లలో కార్యాలయం